TELANGANA POLITRICKS
www.vishalabharati.com
epaper:vishalabharati.com
# పొలిట్రిక్స్
2023-2024
విశాల భారతి
vishalabharathi Telugu Daily
గురువారం, 16.11.2023 హైదరాబాద్
1pm edition



పొలిట్రిక్స్



# సీఎంలయ్యే సీనియర్లకు ఏమైంది!

- పీసీసీ ఎలక్షన్, స్టార్ క్యాంపెయినర్లు ఎటు వోయిన్రు..?
- కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో విచిత్రమైన పరిస్థితి..
- రేవంత్‌రెడ్డి ఒక్కడి భుజాలపైనే ఎన్నికల ప్రచారం
- తమ సీట్ల గెలుపు కోసం తలమునకలవుతున్న పెద్దలు..

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. ఈ తరుణంలో ప్రధాన పార్టీలన్నీ సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. పక్కా వ్యూహాలతో ప్రచారంలో దూసుకెళ్తున్నాయి. అయితే, తెలంగాణ దంగల్‌లో ఎలాగైనా అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ పార్టీలో విచిత్రమైన పరిస్థితి కనిపిస్తోంది. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, ఢిల్లీ నుంచి అడపాదడపా వచ్చే రాహుల్, ప్రియాంక గాంధీలు తప్పితే రాష్ట్రమంతటా ప్రచారం చేయడానికి కాంగ్రెస్‌లో స్టార్ క్యాంపెయినర్లు కనిపించడం లేదని చర్చ నడుస్తోంది. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జానారెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, మధుయాష్కీగౌడ్, జగ్గారెడ్డి లాంటి సీనియర్ నేతలు.. తమ నియోజకవర్గాలకే పరిమితమయ్యారు. వారు పక్క నియోజకవర్గాల్లోకి కనీసం తొంగి చూడడం కూడా లేదు. తమ నియోజకవర్గాలు దాటి మిగిలిన నియోజకవర్గాల్లో కాలు పెట్టిన పాపాన పోవడం లేదు. చుట్టుపక్కల నియోజకవర్గాల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ప్రచారానికి వెళ్లడం లేదు. ఓన్లీ రేవంత్ ఒక్కరే కాలికి బలపం కట్టుకుని తెలంగాణ అంతటా కాంగ్రెస్ తరఫున ప్రచారం చేస్తున్నారు.

**మళ్లా అంతా సీఎంలే..!**

ఉత్తమ్, కోమటిరెడ్డి, జానారెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, జగ్గారెడ్డి లాంటి సీనియర్ నేతలంతా సీఎం సీటు మీద కర్చీఫ్ వేసిన వాళ్లే. ఏదో ఒక సందర్భంలో తమ మనసులో మాట చెప్పినవాళ్లే. పాలిటిక్స్‌లో యాక్టివ్‌గా లేని జానారెడ్డి కూడా సీఎం సీటు మీద మనసు పారేసుకున్నారు. ఆ సీటు తన దగ్గరకే వస్తుందంటూ ఓ సందర్భంలో అన్నారు. నాగార్జున సాగర్‌లో పోటీ చేస్తున్న తన కుమారుడు జైవీర్ రెడ్డి కోసం మాత్రమే జానారెడ్డి ప్రచారం చేస్తున్నారు తప్పితే.. మిగిలిన చోట్ల కాంగ్రెస్ అభ్యర్థుల కోసం క్యాంపెయిన్ చేయడం లేదు. ఇక ఉత్తమ్, కోమటిరెడ్డి, భట్టి, జగ్గారెడ్డి లాంటి నేతలు కూడా తమ నియోజకవర్గాలను తప్పించి వేరే చోట్ల పార్టీ తరఫున ప్రచారానికి వెళ్లడం లేదు.

**ఓడిపోకుండా జాగ్రత్తలు..**

సీఎం సీటు కోసం పోటీలో ఉన్న సీనియర్లు.. కనీసం కొన్ని చోట్ల అయినా ప్రచారానికి రాకపోవడం కాంగ్రెస్ కేడర్‌ను కూడా ఆశ్చర్యపరుస్తోంది. అయితే ఈసారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. ఎమ్మెల్యేలుగా గెలిస్తేనే తమకు కీలక పదవులు వస్తాయని సీనియర్లు భావిస్తున్నారట. అందుకే తమ నియోజకవర్గాల్లో ఓటమి పాలవకుండా చూసుకోవడానికే వాళ్లు తమ తమ స్థానాలను దాటి రావడం లేదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇక పార్టీలో సీనియర్ నేతలుగా చలామణి అవుతున్న శ్రీధర్ బాబు, మధు యాష్కీ, షబ్బీర్ అలీ, అంజన్ కుమార్ యాదవ్ లాంటి వాళ్లు కూడా తమ తమ స్థానాలకే పరిమితమయ్యారు.



# గులాబీ బాస్ స్పీచ్‌లో తగ్గిన జోష్!

- కేసీఆర్‌ప్రసంగంలో కానరాని పంచ్‌లు..
- ప్రతిపక్షాలపై సెటైర్లు, చలోక్తులు నిల్
- ఊకదంపుడు ఉపన్యాసాలతో నిరాశ
- ఈలలు వేస్తే ఇరిటేట్‌అవుతున్న సారు
- కార్యకర్తలపై నోరుజారుతుండని చర్చ

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

సీఎం కేసీఆర్ స్పీచ్‌లో జోష్ కనిపించడం లేదా? గతంలో మాదిరిగా ఆయన ప్రసంగంలో పంచ్‌లు, విపక్షాలపై సెటైర్లు, చలోక్తులు కనిపించడం లేదు. ఇదే విషయంపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. ఈ నెల 15 నుంచి కేసీఆర్ వరుసగా పబ్లిక్ మీటింగుల్లో చేసిన ప్రసంగాలు, ప్రజల నుంచి వచ్చిన స్పందనపై సొంత పార్టీ నేతలే పెదవి విరుస్తున్నారు. దాదాపుగా అన్నిసభల్లో ఒకేవిధంగా ఊకదంపుడు ఉపన్యాసాలు ఇవ్వడంపై క్యాడర్ నిరాశలో ఉన్నారు. సీఎం కేసీఆర్ పబ్లిక్ మీటింగ్‌కు వస్తున్నారంటే ఒక ఊపు, ఒక జోష్ కనిపించేది. ఇప్పుడది మిస్ అయినట్లు వారు పేర్కొంటున్నారు. ఆయన ఏం మాట్లాడుతారోనని సర్వత్రా ఆసక్తి ఉండేదని.. ఇప్పుడు ఆయన ప్రసంగం చప్పగా సాగుతోందని చెబుతున్నారు. సారు మాట్లాడుతుంటే సభ ఈలలు, చప్పట్లతో మార్మోగేది. అలాగే ఆయన చెప్పే మాటలు, చేసే విమర్శలు, ఇచ్చే హామీలు ఎలా ఉంటాయోననే ఆందోళనలో విపక్షాలు సైతం ఉండేది. కానీ ఈ మధ్య కేసీఆర్ పాల్గొన్న సభల్లో అలాంటి ఉత్సాహం, జోష్ కనిపించడంలేదు. పైగా ఈలలు వేస్తే.. సారుకు ఎక్కడలేదని అసహనం, కోపం వస్తుంది. కార్యకర్తలు అనికూడా చూడకుండా నోటికి ఎంతొస్తే అంతే అంటున్నాడు. దీనిపై నేతలు ఆందోళన పడుతున్నారు. సారు మాటలు తమ గెలుపుపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజల నుంచి స్పందన కరువు**

పబ్లిక్ మీటింగ్స్‌లో ఎన్నికల హామీల విషయాన్ని కేసీఆర్ వివరిస్తోన్న సమయంలో ప్రజల నుంచి ఆశించిన మేరకు రియాక్షన్ రావట్లేదన్న టాక్ నడుస్తోంది. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు హామీలకు ధీటుగా ఎన్నికల మేనిఫెస్టోను తయారు చేసేందుకు కేసీఆర్ పెద్ద కసరత్తే చేశారు. అయితే పెన్షన్ల పెంపు, మహిళలకు ప్రతి నెల రూ. 3 వేల సాయం, ప్రతి ఇంటికి బీమా, ఆరోగ్య శ్రీ పరిధి రూ. 15 లక్షలకు పెంచడంతో ప్రజల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ ఆశించిన స్థాయిలో రావడం లేదని, అసలు విడతల వారీగా పెంచుతామని ప్రకటించడం ఏందని, ప్రజలకు వివరించలేక చస్తున్నట్లు నేతలు తమ సన్నిహితుల దగ్గర వాపోతున్నట్లు తెలుస్తోంది. సహజంగా కేసీఆర్ ప్రతిసారి కొత్త తరహాలో మాట్లాడటం ఆయనకు అలవాటు. కానీ ఈ మధ్య ఆ కొత్తదనం కనిపించడం లేదని చర్చ నడుస్తున్నది. ఈ మధ్య జరిగిన కొన్ని సభల్లో కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలోనే ప్రజలు సభ నుంచి బయటికి వెళ్లిపోతున్నారని పార్టీ లీడర్లు చర్చించుకుంటున్నారు.

### సంక్షేమంపై ప్రజల్లో వ్యతిరేకత

**సీఎం కేసీఆర్ ప్రకటించిన దళిత బంధు, బీసీలకు ఆర్థిక సహాయం, గృహలక్ష్మి, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకాలు అమలు తీరుపై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నదని సమాచారం. బీఆరెస్ ఎమ్మెల్యేలు తమ పార్టీ కార్యకర్తలకే ఇచ్చుకున్నారన్న ఆరోపణలు వెలువడుతున్నాయి. ఇటీవల ఇదే విషయంపై జర్నలిస్టులు ప్రశ్నిస్తే.. మంత్రి హరీష్ రావు కోపంతో ఊగిపోయారు. కాంగ్రెస్ ఏజెంట్లా అంటూ విచక్షణ కోల్పోయారు. ఆయనొక్కడే కాదు.. అధికారు పార్టీ నేతలందరూ ప్రశ్నిస్తే చాలు అసహనానికి గురవుతున్నారు. ఇలా క్షేత్ర స్థాయిల్లో పథకాల అమలు తీరు విధానం పట్ల ప్రజా వ్యతిరేక వెలువడుతున్న విషయం స్పష్టం అవుతున్నది. నిరుద్యోగం కూడా పెరిగింది. నోటిఫికేషన్లు రావడం వాయిదాలు పడడం వల్ల నిరుద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది. ఇలా క్షేత్ర స్థాయిలో బీఆరెస్ పట్ల వెలువడుతున్న వ్యతిరేకత సభలలో సీఎం మాట్లాడేటప్పుడు ప్రజలు స్పందిస్తున్న తీరులో వ్యక్త మవుతోందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.**

**బీఆరెస్ పట్టు సడలిందా?**

తొలి జాబితా ప్రకటించిన సమయంలో 100 సీట్లు గెలుస్తాం.. అన్న సీఎం మాటల్లో కనిపించిన విశ్వాసం.. తగ్గుతూ వస్తుందని పొలిటికల్ అనలిస్టులు చెబుతున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం వ్యూహాత్మకంగా వేస్తున్న అడుగులు రాష్ట్రంలో ఈసారి విజయంపై ఆ పార్టీ శ్రేణుల్లో నమ్మకాన్ని పెంచాయి. అది అందించిన ఉత్సాహంతో నేతలు కదలడంతో కాంగ్రెస్ గ్రాఫ్ క్రమంగా పెరిగిందని పరిశీలకులు అంటున్నారు. అదే స్థాయిలో బీఆరెస్ పట్టు సడలిందని చెబుతున్నారు. ముఖ్యమంత్రి మాటల్లో పదును తగ్గటం వెనుక ఇది కూడా ఒక కారణమని అంచనా వేస్తున్నారు. ఇటీవలి కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ కుంగుబాటు బీఆర్ఎస్ గెలుపు అవకాశాలను తీవ్రంగా ప్రభావం చూపిందని అంచనా. ప్రపంచ అద్భుతం అని చెప్పిన కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రారంభించిన నాలుగేళ్లకే కుంగడంతో ప్రచారంలో చెప్పుకోలేని స్థితి అధికార పార్టీది.

**సెంటిమెంట్ మరోసారి దిక్కు**

రాష్ట్రంలో బీఆరెస్ మూడవ సారి అధికారంలోకి వస్తుంది. పక్కాగా హ్యాట్రిక్ కొడతాం. 95 నుంచి 100 సీట్లలో గెలుస్తామని ధీమాగా ప్రకటించిన సీఎం కేసీఆర్.. ఇటీవల కాంగ్రెస్ వస్తే 60 ఏళ్లు వెనక్కు పోతామని హెచ్చరించే ధోరణిలో మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ వస్తే మోసపోతం.. బంగారు కత్తి అని మెడ కోసుకోవద్దు.. ఓడిస్తే ఏం చేస్తం.. రెస్ట్ తీసుకుంటం.. నష్టపోయేది మాత్రం తెలంగాణ ప్రజలే.. అంటూ బేలతనం ప్రదర్శించారని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఆఖరుకు .. ఎవరో ఒకరు గెలుస్తారు.. కానీ.. ఆలోచించి ఓటు వేయాలని అశక్తత ప్రదర్శిస్తున్నారని అంటున్నారు. గతంలో బీజేపీని టార్గెట్ చేసిన కారుపార్టీ నేతలు ఇప్పుడు ఏదో మాట వరుసకు విమర్శించాలి కాబట్టి విమర్శిస్తున్నట్లు అనిపిస్తుంది. రాష్ట్రాన్ని అనేక రంగాల్లో అద్భుతంగా అభివృద్ధి చేశామని చెబుతూనే.. గత రెండు ఎన్నికల మాదిరిగానే.. పదేళ్ల తర్వాత కూడా తెలంగాణ సెంటిమెంట్‌ను మరోసారి రెచ్చగొట్టి ఓట్లు దండుకునే ప్రయత్నం చేయడం ఏందని తెలంగాణ మేధావులు మండిపడుతున్నారు. ప్రస్తుతం సీఎం ప్రసంగాలు చూస్తే.. నాలుగైదు అంశాలపైనే కేంద్రీకరించి.. వాటిని అటుతిప్పి ఇటు తిప్పి చెబుతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో రోజూ లైవ్‌లో చూసి.. మళ్లీ అదే ఉపన్యాసాన్ని వినాల్సి రావడంతో జనాల్లోనూ పెద్దగా ప్రతిస్పందనలు రావడం లేదని అంటున్నారు.

### బాస్ వచ్చినా పెరగని గ్రాఫ్

**ఇటీవల సీఎం కేసీఆర్ అస్వస్థతకు గురికావడంతో మంత్రులు కేటీఆర్, హరీశ్ జిల్లాల్లో సుడిగాలి పర్యటనలు చేశారు. అయితే పార్టీకి ఆశించిన మైలేజ్ రాలేదని అభిప్రాయాలు ఉన్నాయి. పార్టీ కేడర్‌లో జోష్ రావాలంటే కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగాలని, అప్పడే విపక్షాలను కట్టడి చెయొచ్చని చర్చ జరిగింది. కానీ తీరా కేసీఆర్ ప్రజల్లోకి వచ్చినా అనుకున్నంత మేరకు పార్టీ గ్రాఫ్ పెరడడం లేదని ఆందోళన లీడర్లలో మొదలైంది. గతంలో కేసీఆర్ ప్రెస్ మీట్ పెడితే టీవీల ముందు లక్షల మంది కూర్చుని చూసేవారు. ఆ టైమ్‌లో యూట్యూబ్ లో ప్రెస్ మీట్‌కు సుమారు లక్ష వరకు లైవ్ వ్యూస్ ఉండేవి. కానీ ఈ మధ్య ఆయన పబ్లిక్ మీటింగ్స్‌కు పెద్దగా వ్యూస్ రావడం లేదని మీడియా సంస్థలు పెదవి విరుస్తున్నాయి.**



# ఎన్నికల వేళ గుర్తుల గుబులు

- టెన్షన్ లో ప్రధాన పార్టీల అభ్యర్థులు
- భారీ సంఖ్యలో ఇండిపెండెంట్లు
- ఫలితాలు తారుమారవుతాయని ఆందోళన


**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

తెలంగాణలో నిన్నటితో నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగియడంతో భారీ స్థాయిలో ఇండిపెండెంట్ అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. దీంతో వారికి కేటాయించే గుర్తులపై ఎన్నికల కమిషన్ కసరత్తు చేస్తుంది. ఇక, ఈసీ గుర్తుల కేటాయింపులో తమకు కేటాయించిన గుర్తులను పోలిన గుర్తులను ఇవ్వొద్దని పలు పార్టీలు కోరుతున్నాయి. బీఆర్ఎస్ అంటే కారు, బీజేపీ అంటే కమలం, కాంగ్రెస్ అంటే హస్తం గుర్తులు ఓటింగ్ సమయంలో కీలకం కానున్నాయి. ఇంతటి కీలకమైన పార్టీల గుర్తులు కేటాయింపు వెనుక ఎంతో కసరత్తు నెలకొంది.

అయితే, తమ పార్టీ గుర్తు లాంటి ఇతర గుర్తులను వేరే ఎవరికైనా కేటాయిస్తే పార్టీలు భయపడుతుంటాయి. తమకు పడే ఓట్లు వారికి పడి, ఫలితాలు తారుమారు అవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ ఎన్నికల్లో పోటీ పడుతున్న యుగ తులసి ఫౌండేషన్ గుర్తు రోడ్డు రోలర్, అలయెన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ పార్టీ గుర్తు చపాతీ కర్ర, కాగా.. ఇవి తమ పార్టీ గుర్తు కారును పోలి ఉన్నాయని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. దీంతో ఓటర్లు కంగారు పడితే తమకు నష్టం జరుగుతుందని వెంటనే ఆ గుర్తుల కేటాయింపును క్యాన్సిల్ చేయాలని సుప్రీంకోర్టు వరకూ బీఆర్ఎస్ పోయింది. అయితే ఈ అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది.

ఇక, గుర్తుల కేటాయింపులపై దేశ రాజకీయాల్లో కోకొల్లలు.. గుర్తింపు లేని పార్టీల కోసం ఎన్నికల కమిషన్ ముందుగానే కొన్ని గుర్తులను ఎంపిక చేసి పెడుతుంది. అయితే, అందరూ సులభంగా గుర్తించే వాటినే గుర్తులుగా ఎంపిక చేసుకుంటారు. ఉదాహరణకు.. గ్లాసు, పెన్ను, ఏనుగు, చీపురు, విజిల్ లాంటివి.. ఇక, 1990కి ముందు జంతువుల గుర్తులనూ కేటాయించేవారు.. ఎన్నికల సమయంలో సదరు జంతువులను ఊరేగిస్తుండటంతో హింస కిందకు రావడంతో జంతు ప్రేమికులు ఫిర్యాదు చేయడంతో వాటి కేటాయింపును ఈసీ ఆపేసింది. అయితే బహుజన్ సమాజ్ పార్టీకి ఏనుగు, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్కు సింహం గుర్తును కేటాయించింది.

అయితే, ఎన్నికల కమిషన్ కొన్ని గుర్తులను రిజర్వ్ చేసి పెట్టింది. (రిజర్వేషన్ అండ్ లాడ్ మెంట్ ఆర్డర్ 1968 కింద సీఈసీ పార్టీలకు గుర్తులు కేటాయిస్తుంది). దేశంలో 6 జాతీయ, 26 ప్రాంతీయ (గుర్తింపు పొందినవి) ఇక, 2,507 గుర్తింపు లేని పార్టీలు ఉన్నాయి. గుర్తింపు పొందిన పార్టీల గుర్తులు స్థిరంగా ఉంటాయి. ప్రస్తుతం ఎన్నికల కమిషన్ దగ్గర 193 గుర్తులు ఉన్నాయి. వీటి నుంచే కొత్త పార్టీలకు, స్వతంత్రులకు గుర్తులను కేటాయిస్తుంది. తమకు కావాలనే మూడు గుర్తుల డ్రాయింగ్లను ఎన్నికల కమిషన్ కు ఇచ్చి వాటిలో ఒకదాన్ని కేటాయించమని అడగొచ్చు.. ఇలాంటి గుర్తులు ఎవరికి ఉండకపోతే, ఆ గుర్తులు వివాదాస్పదంగా లేకపోతే.. వాటిలో నుంచి ఒకదాన్ని ఎన్నికల కమిషన్ కేటాయిస్తుంది.



# బీఆరెస్‌ను భయపెడుతున్న రోడ్డు రోలర్, రోటి మేకర్..

- గుర్తులు కేటాయించొద్దని సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్
- ప్రజలు గుర్తులు గుర్తుపట్టలేని అమాయకులు కారని వ్యాఖ్య
- గతంలో ఫలితాలు తారుమారు చేసిన గుర్తులు

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

అధికార బీఆరెస్ పార్టీని రోడ్డు రోలర్, చపాతి మేకర్ గుర్తులు భయపెడుతున్నాయి. పోటీల్లో ఇండిపెండెంట్ అభ్యర్థులకు ఎన్నికల సంఘం ఆ గుర్తులను కేటాయించడంతో అధికార పార్టీ అభ్యర్థులు వణికిపోతున్నారు. ఆ గుర్తులు కేటాయించవద్దని బీఆరెస్ లీగల్ సెల్ ఎన్నికల సంఘం వద్ద, సుప్రీంకోర్టులో చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఓటర్లు గుర్తులను గుర్తించలేనంతా అమాయకులు కారంటూ సుప్రీం ఘాటుగానే వ్యాఖ్యానించింది. అయితే గత 2018, 2019పార్లమెంటు ఎన్నికల్లో, పలు ఉప ఎన్నికల్లో కారు గుర్తు పోలిన ట్రక్, రోడ్డు రోలర్, చపాతి మేకర్ గుర్తుల అభ్యర్థులకు భారీగా ఓట్లు నమోదయ్యాయి. దీంతో పలుచోట్ల ఫలితాలు కూడా మారాయి. ఎన్నికల కమిషన్ ఫ్రీ సింబల్స్‌లలో చపాతి మేకర్, డోలి, కుట్టు మిషన్, సబ్బు డబ్బా, టీవీ, కెమేరా, పడవ, రోడ్డు రోలర్ వంటివి ఉన్నాయి. వాటిని ఎన్నికల అధికారులు స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించారు. గతంలో కారును పోలిన గుర్తులతో నకిరేకల్, దుబ్బాక ఎన్నికల్లో బీఆరెస్ అభ్యర్థుల విజయవకాశాలు తారు మారు అయ్యాయి. అలాగే హుజురాబాద్‌లో కూడా కారు గుర్తు పోలిన గుర్తుకు గణనీయంగా ఓట్లు నమోదయ్యాయి. మునుగోడు ఉప ఎన్నికల్లో కూడా యుగ తులసి అభ్యర్థికి కారును పోలిన గుర్తుతో అంచనాకు భిన్నంగా అధిక ఓట్లు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో మరోసారి కారును పోలిన గుర్తులు బీఆరెస్ అభ్యర్థులను భయపెడుతున్నాయి.

# నల్గొండ జిల్లాలో ఐటీ రైడ్స్ కలకలం..

- మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు లక్ష్యంగా దాడులు
- ఎమ్మెల్యే కుమారులు, బంధువుల ఇళ్లలో సోదాలు
- ఇక నుంచి రాష్ట్రంలో రోజూ తనిఖీలు ఉంటాయంటున్న విశ్లేషకులు

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో :**

తెలంగాణలో మరోసారి ఐటీ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ ఆదాయ పన్ను శాఖ అధికారుల సోదాలు కలకలం రేపుతున్నాయి. నిన్ని మొన్నటి వరకు కాంగ్రెస్ నేతల ఇండ్లలో కొనసాగిన తనిఖీలు.. తాజాగా మిర్యాలగూడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే , బీఆర్ఎస్ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు కుమారులు, బంధువులు, అనుచరుల ఇళ్లపై ఏకకాలంలో ఐటీ సోదాలు జరిగాయి. ఉదయం 4 గంటల నుంచే 40 బృందాలు రంగంలోకి దిగాయి. హైదరాబాద్‌లోని వింజమూరి శ్రీధర్ రావు ఇంట్లో ఐటీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అలాగే మిర్యాలగూడలోని వైదేహి టౌన్ షిప్ లోను సోదాలు కొనసాగాయి. శ్రీధరరావుకు నల్లమోతు భాస్కర్ రావు అనుచరుడిగా పేరుంది. శ్రీధర్ రావు ఇంటితో పాటు భాస్కర్ రావు కుమారులు, వారి బంధువు ఇండ్లపై దాడి చేశారు ఆదాయ పన్ను శాఖ అధికారులు. హైదరాబాద్, నల్లగొండ, మిర్యాలగూడలో ఏక కాలంలో 40 బృందాలతో సోదాలు నిర్వహించారు. శ్రీధర్‌రావుతో పాటు భాస్కర్ రావుకు సంబంధించిన వ్యాపారులు రంగా రంజిత్, రంగా శ్రీధర్, బండారు కుశలయ్య నివాసాలలో కూడా ఐటీ అధికారులు విస్తృతంగా తనిఖీలు జరిపారు. నిడమనూరు మండలం శాఖాపురంలోని భాస్కర్ రావు స్వగృహంలో కూడా ఐటీ తనిఖీలు కొనసాగాయి. త్రిపురారం మండలం ముకుందాపురం సాల్వెంట్ ఆయిల్ మిల్లు, నల్లగొండలోని నెహ్రూ గంజ్ లో ఉన్న మహేంద్ర ఆయిల్ మిల్ లో కూడా సోదాలు కొనసాగాయి. ఎన్నికల కోసం భారీగా డబ్బులు నిల్వ ఉంచారన్న అరోపణలతో ఐటీ అధికారులు అకస్మిక తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. దీంతో నల్లగొండ జిల్లా అధికార పార్టీ బీఆర్ఎస్ నేతల్లో గుబులు మొదలయింది. వైదేహి కన్‌స్ట్రక్షన్ పేరుతో నల్లమోతు భాస్కరరావు అనుచరులు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ.. పెద్ద ఎత్తున సొత్తును దాచిపెట్టారని ఐటీ అధికారులు అనుమానిస్తున్నారు. ఎన్నికల ఖర్చు కోసం నగదు అంతా ఇప్పటికే నియోజవర్గాలకు చేరిందని తెలుసుకున్న ఆదాయపు పన్ను శాఖ అధికారులు ప్రతి నియోజకవర్గం పై ఫోకస్ పెట్టినట్లు తెలుస్తుంది. దీనిపై సమాచారం అందిన వెంటనే ఐటీ అధికారులు వారి ఇళ్లు, కార్యాలయాలపై దాడులు చేశారు. ఇక నుంచి ప్రతి రోజు తెలంగాణ వ్యాప్తంగా దాడులు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు సమాచారం.

